క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ గ్రామానికి చెందిన దూదేకుల సంఘం సభ్యులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మోర్తాడ్ ప్రజా నిలయంలో పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి సమక్షంలో చేరగా ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పీసీసీ అధికార ప్రతినిధి బి. వేణుగోపాల్‌యాదవ్, నాయకులు సుంకెట రవి, సత్యం పాల్గొన్నారు.

పట్వారి తులసి స్ఫూర్తిదాయకుడు

ఆర్మూర్‌టౌన్: సామాజిక సేవకుడు పట్వారి తులసి చేస్తున్న సేవలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగవారం జిల్లా కేంద్రంలో పట్వారీ తులసి కుమార్‌ను మహేష్‌కుమార్‌గౌడ్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. పట్వారి గోపికృష్ణ, కేశ వేణు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆటల పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కవిత తన తండ్రి అశోక్ జ్ఞాపకార్థం గ్రామంలో వయో వృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వృద్ధులను అలరించారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆర్మూర్ శాఖ అధ్యక్షుడు నారాయణ వర్మ, ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి మంచాల అందజేత

మాక్లూర్: మండల కేంద్రంలోని కేజీబీవీకి సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు రూ.17 లక్షలు విలువ చేసే 174 మంచాలను అందజేశారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ప్రత్యేక అధికారి స్రవంతి చేతుల మీదుగా విద్యార్థుల సౌకర్యార్థం 174 మంచాలనును అందజేశారు. డీఈవో అశోక్ కుమార్, జీఈసీవో భాగ్యలక్ష్మి, విజయ్‌రావు, కొమిరే శ్రీనివాస్, బాపురావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం.. నిరసన

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ సింగిల్ విండో పరిధిలో ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రైతులు ఆందోళన చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తాలో బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎత్తొండ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకు వచ్చి రోజులు గడుస్తున్నా తీసుకోవడం లేదని వాపోయారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత ఉందని సాకు చెప్పి కాటా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సునీల్ వచ్చి సమస్య తెలుసుకుని ఫోన్ ద్వారా తహసీల్దార్‌కు వివరించారు. సమస్యలు పరిష్కారిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

విచారణ జరిపించాలి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీలో కమిషనర్‌కు సంబంధం లేకుండా అనేక అక్రమాలు జరుగుతున్నాయని, ఈ అక్రమాలపై ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించి విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డుకు సంబంధించి సీడీఎంఏ ద్వారా రూ.70 లక్షలు కాంట్రాక్టర్ అకౌంట్‌లో జమ చేశారని, దీనికి కమిషనర్‌ను బాధ్యుడిని చేయడం సరి కాదన్నారు. సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందించామన్నారు. నాయకులు రజాక్, గంగారాం, అశ్వక్, రవిశంకర్ తదితరులున్నారు.

జాబ్‌మేళాకు స్పందన

బోధన్: పట్టణంలోని ఇందూర్ ఎంబీఏ కళాశాలలో మంగళవారం ఇందూర్ హైస్కూల్ యాజమాన్యం, ఎంబీఏ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. టాస్క్ నిర్వాహకులు హన్మంత్ నేతృత్వంలో యాక్సిస్, హెడీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 200 మంది జాబ్‌మేళాకు రాగా 17 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు.

డీపీవో పర్యటన

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌లో జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) శ్రీనివాస్ రావు మంగళవారం పర్యటించారు. అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో జావిద్ అలీ, పంచాయతీ కార్యదర్శి రజిత తదితరులున్నారు.

లెనిన్‌కు నివాళి

బోధన్/నందిపేట: రష్యన్ రివల్యూషనరీ నాయకుడు వ్లాదిమిర్ లెనిన్ జయంతిని బోధన్, నందిపేట మండలాల్లో న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు.. ఆయన గొప్పతనం గురించి వివరించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

బాల్కొండ: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో కోట కాంతరావు, కల్యాణి దంపతులు తమ ఇంట్లో వడ్డించిన సన్న బియ్యం భోజనాన్ని ఆయన ఆరగించారు. ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘హైలెవెల్’కు మోక్షం కలిగేనా..?

- గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణం కోసం రూ.1.77 కోట్లు మంజూరు
- ఏడాదిన్నరైనా ప్రారంభం కాని పనులు
- వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



సావెల్, కోడిచర్ల గ్రామాల మధ్యలో ఉన్న లోలెవెల్ వంతెన

బాల్కొండ : మెండోరా మండలం సావెల్, కోడిచర్ల గ్రామాల మధ్య లోలెవల్ వంతెన ఉంది. వర్షాకాలంలో ఈ వంతెన మీదుగా వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో గత ప్రభుత్వ హయాంలో లోలెవెల్ వంతెన స్థానంలో కొత్తవంతెన నిర్మాణం కోసం రూ.1.77కోట్ల నిధులను మంజూరు చేశారు. 2023లో పనుల కోసం అప్పటి పాలకులు శంకుస్థాపన చేశారు. అంతే పనుల ఊసే లేదు. ఏడాదిన్నర గడిచిన ఇప్పటి వరకు అటు వైపు కన్నెత్తి చూసే పాలకుడు లేదు. వర్షకాలం ప్రారంభమైందంటే ప్రయాణికులకు కష్టాలు మొదలైనట్లే. జాతీయ రహదారి–63 దొన్కల్ నుంచి జాతీయ రహదారి–44 చాకిర్యాల్ వరకు గల లింకు రోడ్డుపై ఈ వంతెన ఉంది. రెండు జాతీయ రహదారిలను కలిపే లింకు రోడ్డు కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. పాలకులు స్పందించి వర్షాకాలం సీజన్ మొదలయ్యే లోపు పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరో వంతెనకు లభించని మోక్షం..

మెండోరా మండలం వెల్కటూర్, సావెల్ గ్రామాల మధ్య రోడ్డుపై మైనర్ వంతెన నిర్మాణం కోసం రూ.1.2 కోట్ల నిధులు గత ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. పనులకు శంకుస్థాపనలు కూడా చేశారు. కాని ఆ వంతెన నిర్మాణ పనులు కూడ ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభమవుతాయో కూడ సంబంధిత అధికారులకే తెలియడం లేదు.

ఒక్కొక్కటిగా చేపడుతున్నాం

గత ప్రభుత్వంలో నిధులు మంజూరై శంకుస్థాపనలు చేసిన వంతెనల నిర్మాణ పనులను ఒక్కొక్కటిగా చేపడుతున్నాం. ఈ వంతెన నిర్మాణ పనులు కూడా త్వరలోనే చేపడతాం. బడ్జెట్ కేటాయింపు ప్రకారం పనులు జరుగుతున్నాయి. – నాందేవ్, డిప్యూటీ ఈఈ, ఆర్‌అండ్‌బీ, బాల్కొండ

‘అభ్యసన సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలి’



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

బోధన్: చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో హెచ్‌ఎంలకు సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయం మీటింగ్ హాల్‌లో పట్టణ, మండల స్థాయి ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది వివిధ దఫాల్లో నిర్వహించిన పరీక్ష ఫలితాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రత్నాకర్, ఆరిఫోద్దీన్, సీఆర్‌పీలు విజయ్, యూసుఫ్, బాబు, విజయరేఖ, శివానంద్, దేవానంద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



బోధన్ గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించిన భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి అధికారులతో శాఖపరమైన అంశాలపై సమీక్షించారు. స్థానిక గ్రంథాలయ భవనం మొదటి అంతస్తులో కొత్తగా నిర్మించిన రీడింగ్ రూంను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. నిరుద్యోగ విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రంథాలయంలో సౌకర్యాల గురించిఅడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గంగాశంకర్, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సాలూరలో బుద్దె రాజేశ్వర్ విగ్రహావిష్కరణ



బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన బోధన్ మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త ,సీనియర్ నేత దివంగత బుద్దె రాజేశ్వర్ విగ్రహాన్ని గ్రామస్తులు కుల, మతాలు, పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా విరాళాలు పోగు చేసుకుని అంతరాష్ట్ర బైపాస్ రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే విగ్రహావిష్కరణకు బోధన్, బాన్సువాడ ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి హాజరుకానున్నారని రాజేశ్వర్ అభిమానులు తెలిపారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, సహకార సంఘం చైర్మన్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా, వివిధ రాజకీయ పార్టీలలో కీలక హోదాలో పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



త్రిష, 992 బైపీసీ | జ్యోతి, 982 ఎంపీసీ | అమూల్య, 974, ఎంపీసీ



ముబషిరా 937, బైపీసీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన వి. త్రిష బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 992, ఎం జ్యోతి ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 982, ఆర్.అమూల్య ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 974, ముబషిరా కశఫ్, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 937 మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

రుద్రూర్, కోటగిరి కళాశాలల విద్యార్థులు..

రుద్రూర్: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రుద్రూర్ మోడల్ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మోడల్ కళాశాలలో ఎంపీసీ విద్యార్థి అక్షయ్‌కుమార్ 941, బైపీసీలో స్వాతి 938 మార్కులు సాధించి కళాశాల టాపర్‌లుగా నిలిచారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీలో మహీన్ ఫిర్దోస్ 920, ఎస్.రాజేశ్వరి 912 మార్కులు సాధించి కళాశాల టాపర్‌లుగా నిలిచారు.

మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు..

రెంజల్(బోధన్): ఇంటర్ ఫలితాల్లో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు మెరిశారు. మండలంలో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలతో పాటు ఆదర్శ కళాశాలలు ఉన్నాయి. మంగళవారం ఇంటర్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కుల సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

కస్తూర్బాలో 48 శాతం ఉత్తీర్ణత

బోధన్‌రూరల్: అమ్దాపూర్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల విద్యార్థినులు మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 48 శాతం ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో 16 మందికి ఏడుగురు, సెకండ్ ఇయర్‌తో 25 మందికి 17 మంది విద్యార్థులు, ఎంపీసీ ఫస్టియర్‌లో 7 మంది విద్యార్థులకు నలుగురు, సెకండియర్‌లో 7 మంది విద్యార్థులకు ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు.

మహాత్మా జ్యోతీబాపూలేలో 92.25 శాతం ఉత్తీర్ణత

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ మహాత్మా జ్యోతీబా పూలే కళాశాలలో 92.25 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి 116 మంది విద్యార్థులకు 105 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఇదే కళాశాలలో కొనసాగుతున్న చీమన్‌పల్లి మహాత్మాజ్యోతిభాపూలే కళాశాలకు చెందిన 102 విద్యార్థులకు 88 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న కేజీబీవీలో ఫస్టియర్‌లో 58 మంది విద్యార్థులకుగాను 43 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్‌లో 53 మంది విద్యార్థులకుగాను 53 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌కు చెందిన 162 మంది విద్యార్థులకుగాను 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 130 మంది విద్యార్థులకుగాను 52 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో మిస్బా మహీన్ ఎంపీసీలో 456 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో నస్రా నార్మీన్ బైపీసీలో 981 మార్కులు సాధించారు. అఖిల ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 976 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఎస్‌కే షఫ్రీన్ మొదటి సంవత్సరంలో 433 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నాజియా తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు..

పెర్కిట్(ఆర్మూర్): ఇంటర్ ఫలితాల్లో పెర్కిట్ తెలంగాణ మోడల్ స్కూల్, ఆలూర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. మోడల్ స్కూల్‌కు చెందిన ఆర్ చందన ఎంపీసీ(ద్వితీయ సంవత్సరం)లో 981 మార్కులు సాధించారు. అలాగే ఆలూర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన జశ్వంత్ బైపీసీ(ద్వితీయ సంవత్సరం)లో 967 మార్కులు సాధించారు. అలాగే మండలంలోని చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపీసీ విభాగంలో టి.మధురిమ 991, కే. అలేఖ్య 987, ఎస్.ధరణి 983, బి.అనుష్క 980, కె.వివేక్ రెడ్డి 977, కె. రుచిత 974, ఎ.హాసిని 974, బైపీసీ విభాగంలో వి.కీర్తన 991, జి.శ్రీకృతి 985, ఖ్వుద్సియా తబస్సుమ్ 981, బి.హరివర్ధిని 981, సీహెచ్ మధుమిత 973, ఎం సుధీష్ణ 972, జే.శ్రీకృతి 972, ఎంఈసీ విభాగంలో బదాని లిషా 978, సీఈసీ విభాగంలో బి.అక్షయ 959 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన బోధన్ విద్యార్థులు

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.

సత్తాచాటిన ఉషోదయ..



హర్షిత, 995, ఎంపీసీ | అయేషా, 991, బైపీసీ | కె. హర్షిత, 468, ఎంపీసీ



కన్నాబతుల్, 437, బైపీసీ

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎం. హర్షిత 995 అత్యధిక మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. సీహెచ్. పూజిత– 993, సాయిచరణ్– 992, ఓంకార్–991. భాగ్యశ్రీ 990 మార్కులు సాధించారు. బైపీసీలో ఆయేషా జ రీనా 991, ఆదీబా అఫ్రీన్–989, సల్మా తబస్సుమ్ 988 మార్కులు సాధించారు. సీఈసీలో అమీనా బేగం 977, ఎంఈసీలో ఎండీ యాసుపుద్దిన్ 929 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.

ప్రథమ సంవత్సరం ఎంపీసీలో...

ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.హర్షిత 468, అదీనా నాజ్ 466, ముదస్సిర్ 464..బైపీసీలో కన్నాబతుల్ 437, అఫియా బేగం 435, తహూరా తక్మీన్ 435 మార్కులు సాధించి సత్తా చాటారు. సీఈసీలో 500 మార్కులకు ఫిర్దోస్ జహాన్ 491, జి. సృజన్ 481 మార్కులు సాధించారు. ఎంఈసీ గ్రూపులో 500 మార్కులకు ఎ. షాలిని 487 అత్యధిక మార్కులు మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. సత్తా చాటిన విద్యార్థులను ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, ప్రిన్సిపాల్ ఆనంద్‌రెడ్డి అభినందించారు.

వికసించిన విజేత..



హర్షిత్, 991, ఎంపీసీ, | పవిత్ర 994, బైపీసీ | ప్రశాంత్ 468, ఎంపీసీ | శ్రావ్య, 434, బైపీసీ

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బోధన్ పట్టణంలోని విజేత జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి వికసించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్. హర్షిత్ 991, ఎం. మిత్రశ్రీ 989, ఏ. లింగురామ్ 986, డి. మహేష్ 983 అత్యధిక మార్కులు సాధించారు. బైపీసీలో బి.పవిత్ర 994, బి.అక్షయ–990, కె. వినోద్– 988, పి. సతీష్ 985 మార్కులు సాధించారు. సీఈసీ గ్రూప్‌లో ఎస్. సాయితేజశ్రీ 925, డి. అముత్య–891. ఎం. గిరీష్–887, ఎంఈసీలో ఎస్. హస్మిత 904 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.

ప్రథమ సంవత్సరంలో ...

ఎంపీసీలో కె. ప్రశాంత్ 468, కె. మహేష్ 464, జె. రామ్‌దాస్ 462, సీహెచ్. క్రాంతికుమార్ 461, పి. అమూల్య 461..బైపీసీలో 440 మార్కులకు జి. శ్రావ్య 434, హెచ్. లావణ్య 433, జి. మయూరి 431 మార్కులు సాధించారు. సీఈసీలో కె. అభినయ 446 మార్కులు సాధించింది. అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటిన విద్యార్థులను విజేత విద్యా సంస్థల డైరెక్టర్‌యేరువ రమణారెడ్డి, ప్రిన్సిపాల్స్ భూలక్ష్మిరెడ్డి, సుప్రజారెడ్డిలు అభినందించారు.

శ్రీసాయి విద్యార్థుల ప్రతిభ



950, మానస, ఎంపీసీ

నందిపేట్(ఆర్మూర్): ఇంటర్ ఫలితాలలో నందిపేట మండల కేంద్రంలోని శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనభరిచారు. ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం ఫలితాలలో మానస 950 మార్కులు సాధించగా.. ఎంపీసీ మొదటి సంవత్సరంలో వైష్ణవి 470 మార్కులు సాదించింది. ఉత్తమ మార్కులు సాధ/ చిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సంతోష సాగర్, సురేష్, దేవారెడ్డిలు, అధాపకులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలలో 50 శాతం ఉత్తీర్ణత

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్ ఫలితాల్లో బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 301 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 152 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ(తెలుగు మీడియం)లో పిపావత్ భూల 949 మార్కులు, చంద్రకాంత్ 942 మార్కులు సాధించగా, ఇంగ్లీష్ మీడియంలో సబాత్ ఆతీమా 923 మార్కులు సాధించగా, ఎంఎల్‌టీ గ్రూప్‌లో సుమలత 953, మహ్మద్ ఫర్హానోద్దిన్ 930 మార్కులు సాధించి సత్తా చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

విజయసాయి విజయదుంధుబి..



హోమ, 982, ఎంపీసీ | ప్రణీత్ గౌడ్, 946, బైపీసీ | నితిన్, 468, ఎంపీసీ | అభిరామ్, 413, బైపీసీ

ఇంటర్ ఫలితాల్లో బోధన్ పట్టణంలోని విజయ సాయి జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయ దుంధుబి మోగించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎం. హోమ 982 మార్కులు సాధించగా మహేందర్ 973 మార్కులు సాధించారు. బైపీసీలో ప్రణీత్ గౌడ్ 946 మార్కులు సాధించారు.

ప్రథమ సంవత్సరంలో..

ఎంపీసీలో డి. నితిన్ 468 అత్యధిక మార్కులు, బైపీసీలో కె.అభిరామ్ 413 అత్యధిక మార్కులు, సీఈసీలో షియిస్టాబేగం 448 అత్యధిక మార్కులు సాధించగా, వొకేషనల్ గ్రూపులో 500 మార్కులకు ఫరేమా తాజ్‌మీన్ 430 అత్యధిక మార్కులు సాధించి తమ పత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించి విద్యార్థులను ప్రిన్సిపాల్ సుబ్బారావ్ అభినందించారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని కొత్త బస్టాండ్, శక్కర్‌నగర్, ఆటో స్టాండ్, హోటళ్ల, పాన్ షాపుల్లో డాగ్‌స్క్వాడ్ ప్రత్యేక బృందాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలన నేపథ్యంలో సీపీ ఆదేశాలనుసారం తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, మాదకద్రవ్యాలు అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ వెంకట నారాయణ హెచ్చరించారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40
	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101200	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	93,425		

– నిజామాబాద్ బిజినెస్

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఐదు రోజుల జైలు

ఎడపల్లి(బోధన్): మండలం కేంద్రంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా అంబం(వై)గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరు పరచగా 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

సమయపాలన పాటించని వ్యాపారికి..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లో షేక్ మాజీద్ తన దుకాణంను రాత్రి వేళ సమయపాలన పాటించకుండా నడపడంతో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ కేసు నమోదు చేశారు. మాజీద్‌ను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తు తీర్పును వెల్లడించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో మంగళవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. వివరాలు .. గ్రామంలోని శంభుని గుడి నిర్మాణ విషయంలో తగాదా నెలకొంది. శంభుని గుడి నిర్మాణం కోసం ఒక వర్గం వారు ప్రయత్నం చేయగా మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడులకు పాల్పడ్డారు. పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఇద్దరు నిందితుల అరెస్టు

నవీపేట: మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంపునకు చెందిన ఇద్దరు నిందితులు సాయికుమార్, పవన్ కళ్యాణ్ ఈనెల 18న బైక్‌పై వచ్చి ధర్మారం శివారులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వారి నుంచి బైక్, పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

29న బీసీ కులాల ఐక్యతా ర్యాలీ

ఆర్మూర్: బీసీ కులాల ఐక్యత చాటుతూ, వీడీసీల ఆగడాలు, దౌర్జన్యాలను నిరసిస్తూ ఈనెల 29న ఆర్మూర్ పట్టణంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ కులాల జేఏసీ నాయకులు తెలియజేశారు. ఆర్మూర్ సిద్దార్థ డిగ్రీ కళాశాలలో జిల్లాలోని అన్ని బీసీ కుల సంఘాల జిల్లా అధ్యక్షులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అందరి అంగీకారం మేరకు ఆర్మూర్ డివిజన్ బీసీ జేఏసీ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ దురిశెట్టి నరసింహాచారిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు.

పొలానికి నిప్పు.. మొక్కలకు ముప్పు



నికాల్‌పూర్-డొంకేశ్వర్ శివార్లలో కాలిపోయిన మొక్కలు

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులు తమ పొలాలకు నిప్పు పెట్టి పర్యావరణానికి హాని చేయడమే కా కుండా హరితహారం మొక్కలను బుగ్గిపాలు చేస్తున్నారు. మండలంలోని నికాల్‌పూర్, డొంకేశ్వర్ శివా ర్లలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. రైతులు వారి పొలాలకు నిప్పు పెట్టి వదిలేయడంతో మొక్కలను కూడా దహించివేశా యి. ప్రభుత్వం నిధులు ఖర్చు చేసి మొక్కలు నాటిస్తుంటే రైతులు ఈ విధంగా వీటికి హాని కలిగిస్తున్నారు.